TEL : T/TG/2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు  తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

సంపుటి : 01 సంచిక : 250 | శుక్రవారం మే 16 2025 | పబ్లిషర్ హైదరాబాద్ | పేజీలు 5 | వెల-5

విలేఖరులు కావలెను...

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..
మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9533397954





## భక్తులంతా సరస్వతి పుష్కరాల్లో పుణ్యస్నానాలు ఆచరించండి

హైదరాబాద్:
భక్తులంతా సరస్వతి పుష్కరాల్లో పుణ్యస్నానాలు ఆచరించండని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం (మే 15) నుంచి సరస్వతి పుష్కరాలు ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కాళేశ్వర ముక్తేశ్వర క్షేత్రంలోని త్రివేణి సంగమం వద్ద పవిత్ర సరస్వతి పుష్కర మహోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. సీఎంకు అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం సరస్వతి నదిలో మంత్రులతో కలిసి రేవంత్ రెడ్డి పుణ్యస్నానమాచరించారు. తర్వాత ఏకశిలా విగ్రహాన్ని ఆవిష్కరించి.. సరస్వతి మాతకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సరస్వతి పుష్కరాలకు వచ్చే భక్తుల కోసం ఘనంగా అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఎలాంటి లోటు లేకుండా ఏర్పాట్లు చేసిన అధికారులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని అన్నారు. రాబోయే గోదావరి, కృష్ణా పుష్కరాలను ఘనంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇక, మంథని ప్రాంత అభివృద్ధి కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మంథని నుంచే పీవీ నరసింహారావు దేశానికి సేవ చేశారని గుర్తు చేశారు. పీవీ తర్వాత శ్రీపాదరావవు స్పీకర్?గా అద్భుతంగా పని చేశారని కొనియాడారు. శ్రీపాదరావు వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని ఆయన కుమారుడు, మంత్రి శ్రీధర్ బాబు ప్రజ సేవ చేస్తున్నారని అన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు రావడంలో శ్రీధర్ బాబు కృషి ఎనలేదని ప్రశంసించారు. రాబోయే గోదావరి పుష్కరాలతో పాటు కాళేశ్వరం టెంపుల్ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ ఇవ్వండని అధికారులను ఆదేశించారు.

కాగా, ఈ నెల 15 నుంచి 26 వ తేదీ వరకు 12 రోజులపాటు సరస్వతీనది పుష్కరాలు వైభవంగ జరుగనున్నాయి . ఈ సమయంలో సరస్వతి నదితీరంలో పితృదేవతలకు పిండ ప్రదానం చేస్తారు. ఏ నదిలో పుష్కరాలు జరుగుతున్నాయో ఆ నదిలో పవిత్ర స్నానాలు ఆచరిస్తే పాపాల నుంచి విముక్తి కలుగుతుందని పండితులు చెబుతున్నారు. ప్రస్తుతం సరస్వతి నది పుష్కరాలకు సిద్దమవుతుంది.తెలంగాణలోని కాళేశ్వరంలో సరస్వతినదిలో పవిత్ర స్నానాలు చేసేందుకు లక్షలాది మంది భక్తులు సిద్ధమవుతున్నారు. ఈ పుష్కరాలు కాళేశ్వరం ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను పెంచుతుంది. టెంపుల్ టూరిజంపై తెలంగాణ ప్రభుత్వం చూపిస్తున్న ఆసక్తిని కూడా ప్రతిబింబించే అవకాశం ఉంది. భక్తులు ఎలాంటి ఇబ్బంది పడకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది.

### సరస్వతి నది పుష్కరాలు జరిగే ప్రదేశాలు

తెలంగాణా రాష్ట్రంలోని కాళేశ్వరంలోని త్రివేణీ సంగమంలోను సరస్వతీ నదీ పుష్కరాలు జరుగుతాయి. సరస్వతీ నది ఉత్తరాఖండ్ రాష్ట్రం బద్రీనాథ్ దగ్గరలోని "మన" అనే గ్రామంలో పుట్టింది. అయితే ఈ నది అంతర్వాహిని. అందువల్ల సరస్వతి నదీ పుష్కరాలు "మన" లో జరుగుతాయి. తెలంగాణ, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు వస్తారు. నదిలో సమృద్ధిగా నీళ్లు ఉండి, పుష్కరాలు విజయవంతంగా జరిగేందుకు తెలంగాణ ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుంది.




## కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం.. సుప్రీం కీలక వ్యాఖ్యలు

దిల్లీ:
హైదరాబాద్‌లోని కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సుప్రీంకోర్టు లో విచారణ జరిగింది. సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. పర్యావరణ అనుమతులు తీసుకున్నారా? లేదా? అనేది స్పష్టం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రశ్నించారు.

## 8వేల కోట్ల ఫీజు బకాయిలు

- తక్షణమే చెల్లించి ఆదుకోండి
- సిఎం రేవంత్‌కు బండి సంజయ్ లేఖ



హైదరాబాద్,మే15 :
తక్షణమే ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కేంద్రమంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో రూ.8వేల కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. బకాయిలు చెల్లించకపోవడంతో ప్రైవేటు- కళాశాలలు దిక్కుతోచని స్థితిలో ఉన్నాయి. ఇప్పటికే అనేక డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలలు మూతపడ్డాయి. కొన్ని కాలేజీలు ఫీజులు చెల్లించనిదే విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వట్లేదు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని లేఖలో పేర్కొన్నారు.

2 లో

## అణగారిన వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత

» ఆ భయంతోనే కులగణనకు మోడీ అంగీకారం

» బీహార్పర్యటనలో రాహుల్ విమర్శలు




పాట్నా,మే15
దేశంలో అణగారిన వర్గాల నుంచి వ్యతిరేకత ఎదురవుతుందనే భయంతోనే ప్రధాని మోదీ కులగణనకు అంగీకరించారని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ అన్నారు. వెనుకబడిన వర్గాల తరఫున పోరాడుతున్న ప్రతిపక్షానికి ప్రధాని భయపడ్డారని అన్నారు. బిహార్‌లోని దర్భంగాలో నిర్వహించిన సమావేశంలో మిథిలా యూనివర్సిటీ- విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కేవలం 5శాతం మంది ప్రజల ప్రయోజనాల కోసమే మోదీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

మిగతాద్ది 2 లో




## యాదగిరిగుట్టలో ప్రపంచ అందగత్తెలు

యాదాద్రి:
ప్రపంచ హెరిటేజ్ విలేజ్ భూదాన్ పోచంపల్లి, ఆధ్మాతిక క్షేత్రమైన యాదగిరిగుట్టలో ఇవాళ ప్రపంచ సుందరీమణులు పర్యటించారు. మిస్ వరల్డ్ పోటీదారులకు ఆలయ సంప్రదాయం ప్రకారం అధికారులు ఘన స్వాగతం పలికారు. యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్నారు. ముందుగా పోచంపల్లిలో చేనేత ఇక్కత్, డబుల్ ఇక్కత్ చీరల తయారీ, పుట్టపాక తేలియా రుమాల్, సిద్దిపేట గొల్లభామ, నారాయణపేట, గద్వాల చీరలు, వస్త్రాలను పరిశీలించారు.

2 లో

## 'ఇది తెలంగాణ ఆడబిడ్డలకు అత్యంత తీవ్రమైన అవమానం'



హైదరాబాద్:
మిస్ వరల్డ్ పోటీల్లో భాగంగా హైదరాబాద్ కు వచ్చిన విదేశీ వనితలకు తెలంగాణ ఆడబిడ్డల చేత కాళ్లు కడిగించడాన్ని కేంద్ర మంత్రి, బీజేపీ ఎంపీ కిషన్‌రెడ్డి తీవ్రంగా తప్పుబట్టారు. ఈ విషయంలో తెలంగాణ ఆత్మగౌరవాన్ని, మన ఆడబిడ్డల అభిమానాన్ని తాకట్టుపెట్టారంటూ ధ్వజమెత్తారు. తెలంగాణ ఆడపడుచులతో విదేశీ వనితల కాళ్లు కడిగిస్తారా? అంటూ ప్రశ్నించారు కిషన్‌రెడ్డి. ఈ మేరకు గురువారం పత్రికా ప్రకటన విడుదల చేశారు కిషన్‌రెడ్డి. ' ప్రపంచదేశాల ముందు తెలంగాణ ఆత్మగౌరవాన్ని పెంచాల్సింది పోయి.. వారి ముందు మన ఆత్మాభిమానాన్ని తాకట్టుపెట్టేట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించడం సిగ్గుచేటు. 72వ మిస్‌వరల్డ్ పోటీల్లో భాగంగా.. కల్చరల్, స్పిరిచువల్ టూర్‌లో పాల్గొనేందుకు.. యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్ అయిన రామప్ప దేవాలయానికి ప్రపంచ అందగత్తెలు వచ్చిన సందర్భంలో.. విదేశీ వనితల కాళ్లను తెలంగాణ మహిళలతో, దళిత, గిరిజన యువతులతో కడిగించడం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అహంకారానికి నిదర్శనం.

## సైబర్ భద్రత బలోపేతం.. గూగుల్ క్లౌడ్‌తో సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఒప్పందం

హైదరాబాద్:
తెలంగాణలో సైబర్ భద్రత బలోపేతం కోసం గూగుల్ క్లౌడ్‌తో రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఒప్పందం కుదుర్చుకుంది. భద్రత, బెదిరింపులను ముందస్తుగా గుర్తించడానికి గూగుల్ క్లౌడ్ ఉపయోగపడనుంది. ఈ ఒప్పందం తెలంగాణ పోలీసుల సైబర్ రక్షణ సామర్థ్యాలను మరింత బలోపేతం చేయనుంది. దీని ద్వారా సైబర్ సెక్యూరిటీ 24/7 పర్యవేక్షించే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా పోలీసుల ఐటీ మౌలిక సదుపాయాల పర్యవేక్షణకు వీలుంటుంది. ఈ ఎంఓయూకి మూడేళ్ల కాలవ్యవధి ఉంటుందని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయెల్ తెలిపారు.

## ఈనెల 17 నుంచి హైదరాబాద్ మెట్రో రైలు ఛార్జీలు పెంపు



హైదరాబాద్:
ఈనెల 17 నుంచి హైదరాబాద్ మెట్రో రైల్ ఛార్జీలు పెరగనున్నాయి. కనీస ఛార్జీ రూ.10 నుంచి రూ.12కి, గరిష్ఠ ఛార్జీ రూ.60 నుంచి 75కి పెంచుతున్నట్లు హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ ప్రకటించింది.

### పెరిగిన ఛార్జీల వివరాలు

మొదటి రెండు స్టాప్‌లకు రూ.12,రెండు నుంచి 4 స్టాప్‌ల వరకు రూ.18,4 నుంచి 6 స్టాప్‌ల వరకు రూ.30,6 నుంచి 9 స్టాప్‌ల వరకు రూ.40,9 నుంచి 12 స్టాప్‌ల వరకు రూ.50,12 నుంచి 15 స్టాప్‌ల వరకు రూ.55,15 నుంచి 18 స్టాప్‌ల వరకు రూ.60,18 నుంచి 21 స్టాప్‌ల వరకు రూ.66,21 నుంచి 24 స్టాప్‌ల వరకు రూ.70,24 స్టాప్‌లు.. ఆపైన రూ.75

## 'రైతుల ప్రాణాలంటే తెలంగాణ ప్రభుత్వానికి లెక్కలేదు'



హైదరాబాద్:
ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతు చనిపోతే రూ. 50 లక్షల పరిహారం ఇవ్వాలనే ఆలోచన ప్రభుత్వానికి లేదంటూ బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి ధ్వజమెత్తారు. రైతుల ప్రాణాలంటే తెలంగాణ ప్రభుత్వానికి లెక్కలేదని విమర్శించారు. ఈ రోజు(గురువారం) బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ.

మిగతాది 2లో

# సంపాదకీయం

## ‘శాంతిదూత’ ట్రంప్!



అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అంత సులభంగా అర్థం కారని ఆయన గల్ఫ్ దేశాల పర్యటన తీరుతెన్నులు చూస్తే తెలుస్తుంది. తాను అధికారంలోకొస్తే పశ్చిమాసియాలో సాగుతున్న ‘అంతూ దరీ లేని యుద్ధాలకు’ ముగింపు పలుకుతానని అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో ఆయన తరచు అనే వారు. ప్రస్తుతం కొనసాగుతున్న నాలుగు రోజుల గల్ఫ్ పర్యటనలో ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు గమనిస్తే ఆ వాగ్దానాన్ని ఆయన నెరవేర్చదల్చుకున్నట్టు కనబడుతోంది.తన రెండో దశ పాలనలో ట్రంప్ మొదలెట్టిన తొలి విస్తృత విదేశీ పర్యటన ఇది. ఈ ప్రాంతంలోనే ఉన్న ఇజ్రాయెల్ పర్యటనకు వెళ్లకపోవటం ఆయన తాజా వైఖరికి సంకేతం. ఇది ఎన్నాళ్లుంటుందన్నది తెలియక పోయినా చేస్తున్న ప్రకటనలైతే భిన్నంగా ఉన్నాయి. ఇరాన్‌తో అమెరికా 46 ఏళ్లుగా సాగిస్తున్న ‘అప్రకటిత యుద్ధం’ ఇక కొనసాగనీయరాదన్న అభిప్రాయం ఉందని మంగళవారం సౌదీ అరేబియాలోని రియాద్‌లో ఆయన ప్రకటించారు. బుధవారం సిరియా అధ్యక్షుడు అహ్మద్ అల్%-% షారాతో భేటీ అయ్యారు. ఇజ్రాయెల్‌తో మంచి సంబంధాలు నెలకొల్పుకొనాలని సలహా ఇచ్చారు.అల్%-%షారాకు గతంలో అల్ కాయిదాతో, ఐఎస్‌తో సంబంధాలుండేవి. ఈ భేటీకి ముందే గల్ఫ్ సహకార మండలి(జీసీసీ) సదస్సులో సిరియాపై ఆంక్షలు ఎత్తేస్తున్నట్టు తెలియజేశారు. ఈ నిర్ణయాలపై ఇజ్రాయెల్ అలిగినా, మరొకరు అభ్యంతర పెట్టినా ఆయన ఖాతరు చేయదల్చుకున్నట్టు లేరు. గత నెలలో ట్రంప్‌ను కలిసి సిరియాపై ఆంక్షలు కొనసాగించాలని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ వేడుకున్నారు. ఇరాన్ విషయంలో అయితే చాలా చెప్పివుంటారు. సిరియాపై ఆంక్షలు ఎత్తేయటం, ఇరాన్‌తో చెలిమికి సిద్ధపడటం నెతన్యాహూకు ససేమిరా ఇష్టం లేదు.కానీ లీకుల ద్వారా తప్ప నేరుగా తన అసమ్మతిని ఇంతవరకూ తెలియజేయలేదు. ఆ మధ్య ట్రంప్ ఇందుకు భిన్నంగా మాట్లాడారు. అణు ఒప్పందాన్ని అంగీకరించి, శాంతికి సిద్ధపడకపోతే ఇరాన్ భారీ స్థాయి ఒత్తిడులు ఎదుర్కొనక తప్పదని హెచ్చరించారు. కానీ ట్రంప్ తాజా ధోరణి అందుకు భిన్నంగా ఉంది. ఇరాన్‌తో చెలిమి గురించి ఆయన ఏదో మాటవరసకు అనలేదు.‘ప్రస్తుతం అమెరికాకు అత్యంత సన్నిహిత దేశాలు కొన్ని తరాల కిందట మాపై శత్రుత్వంతో చెలరేగినవే’ అని గుర్తుచేశారు. సిరియా, ఇరాన్‌ల విషయంలో తన వైఖరి మారటానికి సౌదీ అరేబియా యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ కారణమని ఆయన జీసీసీ వేదికపైనే ప్రకటించారు కూడా. యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదార్లు ఇజ్రాయెల్‌పై విరుచుకుపడుతూనే ఉన్నా ఈనెల 5న వారితో అవగాహనకొచ్చారు. స్నేహంలోనైనా, శత్రుత్వంలోనైనా ట్రంప్ తీరే వేరని ఆయన నిర్ణయాలు తెలియజేస్తున్నాయి. మూడేళ్లనాడు అప్పటి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సౌదీ వచ్చినప్పుడు దేశంలో మానవహక్కులు అడుగంటుతున్న వైనంపై సౌదీ యువరాజును నేరుగా ప్రశ్నించారు. 2018లో జర్నలిస్టు జమాల్ ఖషోగ్గి ప్రాణం తీయించడాన్ని ప్రస్తావించారు. ఈ మాదిరి హత్యలు తమకు సమ్మతంకావని చెప్పారు. అందుకే కావొచ్చు... ఇప్పుడు ట్రంప్‌కు ఎదురైన స్వాగతసత్కారాల వంటివి బైడెన్‌కు లభించలేదు.సౌదీ గడ్డపై గతకాలపు అమెరికా అధ్యక్షుల్ని నిశితంగా విమర్శించటానికి ట్రంప్ వెన కాడలేదు. అమెరికన్ సమాజం గురించి కాస్తయినా తెలియనివారు ఎంతో జటిలమైన గల్ఫ్ సమా జాల్లో జోక్యం చేసుకోవటానికి ఎగబడ్డారని వ్యాఖ్యానించటం చిన్న విషయం కాదు. పశ్చిమాసియా దేశాలతో ఎన్ని వేల కోట్ల డాలర్ల ఒప్పందాలు కుదుర్చుకోగలమన్నదే ఆయన ఆరాటంగా కనబడు తోంది. దానికి తగ్గట్టే మంగళవారం సౌదీతో 14,200 కోట్ల డాలర్ల మేర ఆయుధ ఒప్పందంపై సంతకాలయ్యాయి. ఇదిగాక అమెరికాలో 60,000 కోట్ల డాలర్ల పెట్టుబడులు పెట్టబోతున్నట్టు యువరాజు ప్రకటించారు. ట్రంప్ దీంతో సంతృప్తిపడలేదు. దీన్ని లక్ష కోట్ల డాలర్లకు పెంచాలని ఆ వేదికపైనుంచే కోరారు. సౌదీతో అమెరికాకు ఎప్పుడూ మంచి స్నేహసంబంధాలేవున్నా ఈ స్థాయి ఒప్పందాలెప్పుడూ లేవు. ఒక పరిశోధక సంస్థ నివేదిక ప్రకారం 2010%-%20 మధ్య అమెరికాకు సౌదీతో 10,000 కోట్ల డాలర్ల విలువైన ఆయుధ ఒప్పందాలు మాత్రమే కుదిరాయి.స్నేహం పేరుతో అమెరికాను దోచుకుంటున్నారని నాటో భాగస్వామ్య దేశాలైన పాశ్చాత్య మిత్రులపై తరచూ విరుచుకుపడే ట్రంప్...పశ్చిమాసియా దేశాలకు ఏ కష్టమొచ్చినా అమెరికా దృఢంగా నిలబడుతుందని హామీ ఇవ్వటం గమనార్హం. ఇంధన అవసరాల్లోనూ, రక్షణరంగంలోనూ పనికొచ్చే అత్యంత విలువైన లిథియం, కోబాల్ట్‌లతోపాటు థోరియం వంటి రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ అన్వేషించి అమెరికా చేర్చటానికి సౌదీ%-%అమెరికా ఖనిజ సంస్థల మధ్య ఈ పర్యటనలో 900 కోట్ల డాలర్ల ఒప్పందం కుదరటంతో ట్రంప్ సంతోషానికి పట్టపగ్గాల్లేవు. అందువల్లే పశ్చిమాసియాకు శక్తి మంతమైన సెమీ కండక్టర్ చిప్స్, ఏఐ డేటా సెంటర్లకు పనికొచ్చే కీలక విడిభాగాల ఎగుమతులకు ఆయన పచ్చజెండా ఊపారు. ఇది సంప్రదాయ అమెరికా విదేశాంగ విధానానికి భిన్నం.ఈ పర్యటనలో ట్రంప్ స్వకార్యమూ నెరవేర్చుకుంటున్నారన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. దేశ ప్రయోజనాలకూ, అధ్యక్షుడిగా ఆయన నిర్ణయాలకూ చుక్కెదురన్నది విమర్శకుల వాదన. ట్రంప్ సొంత సంస్థకు సారథ్యం వహిస్తున్న ఆయన కుమారులు గత కొన్నివారాలుగా గల్ఫ్‌లో తిష్ఠ వేసి తమ సంస్థ ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారనీ, కుదిరిన ఒప్పందాలన్నీ వారికి మేలు కలిగించేవేననీ అంటున్నారు. ఏది ఏమైనా ట్రంప్ వైఖరి మళ్లీ మారేలోగా పశ్చిమాసియా చక్కబడితే ప్రపంచానికి అంతకన్నా కావాల్సిందేమీ లేదు.

## కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం.. సుప్రీం కీలక వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి

లాంగ్ వీకెండ్ చూసి ఎందుకు చర్యలు మొదలు పెట్టారని ధర్మాసనం మరోసారి ప్రశ్నించింది. నష్టాన్ని పూడ్చేందుకు తీసుకునే చర్యలను స్పష్టంగా చెప్పాలంది.

కేంద్ర సాధికార సంస్థ దాఖలు చేసిన నివేదికపై కౌంటర్ దాఖలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపు న్యాయవాది సమయం కోరారు. పర్యావరణానికి జరిగే నష్టాన్ని పూడ్చే చర్యలు చేపట్టకపోతే సీఎస్ సహా కార్యదర్శులు జైలుకు పోవాల్సి ఉంటుందని ధర్మాసనం ఘాటుగా వ్యాఖ్యానించింది. ఈ సందర్భంగా విజిల్ బ్లోయర్స్, విద్యార్థులపై కేసుల విషయాన్ని పలువురు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఆ కేసులు కొట్టివేయాలని అప్లికేషన్ దాఖలు చేసినట్లు తెలపగా.. ఈ పిటిషన్‌తో కలిపి విచారించడం కుదరదని సీజేఐ స్పష్టం చేశారు. కావాలనుకుంటే వేరే పిటిషన్ దాఖలు చేసుకోవచ్చన్నారు. అనంతరం తదుపరి విచారణను జులై 23కి సుప్రీంకోర్టు వాయిదా వేసింది.

## ‘ఇది తెలంగాణ ఆడబిడ్డలకు అత్యంత తీవ్రమైన అవమానం’

మొదటిపేజీ తరువాయి

మహిళా సాధికారతకు, మహిళల ధైర్యసాహసాలకు ప్రతీక అయిన రాణి రుద్రమదేవి ఏలిన గడ్డపై, చారిత్రక రామప్ప ఆలయ ప్రాంగణంలో తెలంగాణ మహిళలను అవమానించడం దురదృష్టకరం.సమ్మక్క, సారలమ్మ పుట్టిన గడ్డపై మహిళలకు అత్యంత తీవ్రమైన అవమానం జరిగింది. ఇది కాంగ్రెస్ పార్టీ సంస్కృతి. భారతీయులను విదేశీయుల ముందు మోకరిల్లేలా చేయడమే కాంగ్రెస్ పార్టీ చరిత్ర. ఢిల్లీలోని ఆ కాంగ్రెస్ పార్టీ పెద్దలను సంతృప్తి పరిచేందుకే రాహుల్ గాంధీ.. భారతీయ మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా కాళ్లు కడిగించారు.‘అతిథి దేవో భవ’ మన విధానం.. కానీ అతిథిని గౌరవించే క్రమంలో మన మహిళల ఆత్మగౌరవాన్ని తగ్గించేలా వ్యవహరించడం క్షమార్హం కాదు. విదేశీ అందగత్తెలముందు మన గౌరవాన్ని పెంచేలా వ్యవహరించి ఉంటే బాగుండేది. కానీ మన గౌరవాన్ని దిగజార్చింది. ప్రజల గౌరవాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యత కానీ.. దీనికి విరుద్ధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించడాన్ని తెలంగాణ బీజేపీ తీవ్రంగా ఖండిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం తీరు ఏమాత్రం సమర్థనీయం కాదు.ఇందుకుగానూ.. సోనియాగాంధీ, రాహుల్ గాంధీలతోపాటుగా రేవంత్ రెడ్డి.. భారతీయ మహిళలకు, తెలంగాణ మహిళా సమాజానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలి’ అని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

## అణగారిన వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత

మొదటిపేజీ తరువాయి

దళితులు, ఓబీసీలు, ఆదివాసీలకు ఈ ప్రభుత్వంలో స్థానం లేదని, కార్పొరేట్ వ్యక్తులకే మోదీ గవర్నమెంట్ వత్తాసు పలుకుతోందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణలో చేపట్టిన విధంగా దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని, ప్రైవేటు- కళాశాలలు, యూనివర్సిటీల్లో రిజర్వేషన్లు కల్పించాలని, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కోసం కేటాయించిన నిధులను విడుదల చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ప్రభుత్వం మెడలు వంచైనా వీటిని సాకారం చేసుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.తాను ఇక్కడికి రాకుండా అడ్డుకునేందుకు స్థానిక నేతలు, అధికారులు ఎంతో ప్రయత్నించారని అన్నారు. అన్ని అడ్డంకుల్నీ అధిగమించి వచ్చానని చెప్పారు. ఈ ఏడాది చివర్లో బిహార్ శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఇప్పటి నుంచే ఎన్నికల వ్యూహాలను అమలు చేస్తోంది. అందులో భాగంగానే బిహార్‌లో

యువతతో మమేకమయ్యేందుకు తలపెట్టిన ’శిక్షా న్యాయ్ సంవాద్’ కార్యక్రమాన్ని రాహుల్ గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మిథిలా యూనివర్సిటీ- ప్రాంగణంలో ఏర్పాటు- చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశాన్ని అడ్డుకునేందుకు అధికారపార్టీ నాయకులు, అధికారులు ఎంతో ప్రయత్నించారు. యూనివర్సిటీ- గేటు- బయటే నా కారును నిలిపివేశారు. అయినా, నేను వెనకడుగు వేయలేదు. నడుచుకుంటూ సభా వేదిక మీదికి చేరుకున్నాను. బిహార్ ప్రభుత్వం నన్ను ఎందుకు ఆపలేకపోయిందో తెలుసా? మీ అందరి అభిమానమే నన్ను ముందుకు నడిపించింది. ఇదే శక్తి నరేంద్ర మోదీని గద్దె దించుతుంది. ప్రతిపక్షాల డిమాండ్ మేరకే కులగణను మోదీ అంగీకరించారు. ఈ విషయం దేశ ప్రజలందరికీ తెలుసని రాహుల్ అన్నారు. ఎన్డీయే ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం కాకుండా...అంబానీ, అదానీల కోసమే పని చేస్తోందని రాహుల్ విమర్శించారు.

## 8వేల కోట్ల ఫీజు బకాయిలు

మొదటిపేజీ తరువాయి

ఈ మేరకు బండి సంజయ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీలను ప్రభుత్వమే విస్మరించిందని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కారణంగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ. 8,000 కోట్ల ఫీజు బకాయిలు పేరుకుపోయాయని ఆయన లేఖలో పేర్కొన్నారు. బండి సంజయ్ పేర్కొన్న వివరాల ప్రకారం, ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. అధ్యాపకులకు జీతాలు, సిబ్బందికి భత్యాలు, కాలేజీల నిర్వహణ ఖర్చులు కూడా భరించలేని స్థితిలో ఉన్నాయని, అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే అనేక డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలలు మూతపడటం ప్రారంభించాయని బండి సంజయ్ హెచ్చరించారు. విద్యార్థులకు ఫీజులు చెల్లించనిదే సర్టిఫికెట్లు- ఇవ్వడం లేదని, దీంతో విద్యార్థులు, కళాశాల యాజమాన్యాల మధ్య వాగ్వాదాలు తీవ్రమై పోలీస్ స్టేషన్ల దాకా కేసులు వెళ్లుతున్నాయని అన్నారు.

అసెంబ్లీ సాక్షిగా ఫీజు బకాయిలను వన్ టైం సెటిల్ మెంట్ చేయాలని ఒకసారి, మరోసారి 12 వాయిదాల్లో చెల్లిస్తామని ముఖ్యమంత్రి మాట ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడు ఆ మాటలను విస్మరించడం దురదృష్టకరమని ఆయన విమర్శించారు. ఈ విద్యా సంవత్సరం నుండే బకాయిలను నిర్ణీత వ్యవధిలో చెల్లిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. బండి సంజయ్ ప్రభుత్వానికి హితవు పలుకుతూ, విద్యార్థుల భవిష్యత్తును, కళాశాలల మనుగడను దృష్టిలో పెట్టు-కుని తక్షణమే బకాయిల చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యారంగంపై ప్రభుత్వం చూపుతున్న అలసత్వం లక్షలాది మంది విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మానసిక క్షోభ కలిగిస్తోందని తీవ్రంగా విమర్శించారు.

## యాదగిరిగుట్టలో ప్రపంచ అందగత్తెలు

మొదటిపేజీ తరువాయి

ఇందు కోసం 13 స్టాళ్లను ఏర్పాటు చేశారు.

చేనేత విశిష్టతను వివిధ దేశాల అందగత్తెలకు వివరించారు. మరోవైపు తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కృష్ణశిలతో నిర్మితమైన యాదగిరి గుట్ట శ్రీలక్ష్మీ నర్సింహస్వామి ఆలయ విశిష్టతను ప్రపంచ సుందరీమణులకు వివరించారు.

కాగా, పట్టు పరికిణీలు, చీరలు కట్టుకొని తెలుగుదనం ఉట్టిపడేలా తిలకం దిద్దుకున్న ప్రపంచ దేశాల సుందరీమణులు నిన్న(బుధవారం) ఓరుగల్లు పర్యటనలో జిగేల్‌మన్నారు. హెరిటేజ్ వాక్‌లో భాగంగా వివిధ దేశాలకు చెందిన 57 మంది సుందరీమణులు రెండు బృందాలుగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించారు. వరంగల్ కోట సందర్శనలో 22 మంది బుధవారం సాయంత్రం హనుమకొండకు చేరుకున్నారు. మరో బృందం ములుగు జిల్లా రామప్పలో సందడి చేసింది.

సుందరీమణులకు తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే విధంగా తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలతో మహిళలు, సంప్రదాయ డోలు వాయిద్యాలతో ఆత్మీయ స్వాగతం పలికారు. మహిళలతో కలిసి బతుకమ్మ పాటలకు సుందరీమణులు నృత్యాలు చేశారు. అనంతరం సంప్రదాయ ప్రకారం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన తాంబాలంలోని చెంబులో ఉన్న నీళ్లతో సుందరీమణులు కాళ్లను కడుక్కున్నారు. ఆలయ ఆవరణలో ఉన్న నంది విగ్రహం వద్ద ఫొటో షూట్‌లో పాల్గొన్నారు.

అనంతరం కల్యాణ మంటపాన్ని దర్శించారు. అనంతరం ప్రధాన ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసిన సుందరీమణులు వరంగల్ కోటను సందర్శించి అక్కడే ఏర్పాటు చేసిన పేరిణి శివతాండవం, ఇతర సంప్రదాయ నృత్యాలను చూసి తిరిగి హరిత హెూటల్‌కు చేరుకుని డిన్నర్ చేసి హైదరాబాద్‌కు బయలుదేరారు. ములుగు జిల్లా రామప్ప ఆలయం వద్ద ప్రపంచ సుందరీమణులకు గుస్సాడీ నృత్య ప్రదర్శన, ఒగ్గుడోలు ప్రదర్శన ద్వారా కళాకారులు ఆత్మీయ స్వాగతం పలికారు. ఆ తర్వాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ విశిష్టత చరిత్ర ఆలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పురాతన కట్టడం, వారసత్వ సంపద.. రామప్ప ఆలయాన్ని తిలకించి మంత్రముగ్ధులయ్యారు.

## ‘రైతుల ప్రాణాలంటే తెలంగాణ ప్రభుత్వానికి లెక్కలేదు’

మొదటిపేజీ తరువాయి

‘40 కేజీల వరి ధాన్యం బస్తా నుంచి 4 కేజీల తరుగు తీస్తున్నారు. 13 లక్షల క్వింటాళ్ల ధాన్యం తరుగు రూపంలో పక్కదారి పడుతుంది. 6 వేల కోట్ల రూపాయల తరుగు రూపంలో రైతుల నుంచే కొట్టేస్తున్నారు.

ఇది ఎవరి ఖాతాల్లో చేరుతోంది. బ్లాక్ లిస్ట్ లో పెట్టిన రైస్ మిల్లు లు ఎన్ని ?, బ్లాక్ లిస్ట్ లో పెట్టిన రైస్ మిల్లులకు మళ్ళీ ఎందుకు ధాన్యం పంపుతున్నారు ? ,గతంలో ధాన్యం తీసుకుని సీఎంఆర్ ఇవ్వని రైస్ మిల్లులకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు ?, ధాన్యం కొనుగోలులో జరుగుతున్న అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం CBI తో దర్యాప్తు చేయించాలి. బీఆర్ఎస్ పాలనలో సివిల్ సప్లై శాఖలో అవినీతి జరిగిందని ఆరోపించిన రేవంత్, ఉత్తమ్... ఎందుకోసం విచారణ చేయడం లేదు ?’ అని మహేశ్వర్ రెడ్డి ప్రశ్నించారు.

## విజయవాడ బస్టాండ్‌లో రెచ్చిపోయిన గ్యాంగ్ అధికారిపై పిడిగుద్దులు గుద్ది పరార్

విజయవాడ బస్టాండ్‌లో గంజాయి బ్యాచ్ రెచ్చిపోయింది. శ్రీశైలం పవర్ ప్లాంట్‌లో విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ సెక్రటరీ కృష్ణారావుపై విచక్షణారహితంగా ఆ గ్యాంగ్ దాడికి పాల్పడ్డారు. గురువారం ఉదయం శ్రీశైలం నుంచి విజయవాడ విద్యుత్ సౌదాకు విధి నిర్వహణపై వచ్చిన కృష్ణారావుపై గంజాయి బ్యాచ్ పిడిగుద్దులతో దాడి చేసి అక్కడి నుండి పారిపోయారు. వీరి నుంచి తప్పించుకుని ప్రాణాలు దక్కించుకున్న కృష్ణారావు అక్కడి నుంచి బస్టాండ్‌లోకి పరుగులు తీశారు. అనంతరం కొండపల్లిలోని తన నివాసానికి చేరుకున్నారు. కృష్ణారావు బస్ దిగి వస్తుండగా సిటీ బస్ టెర్మినల్ దగ్గర ఈ ఘటన జరిగింది. అయితే దాడి చేసిన వారు ఎవరో తనకు తెలియదని, నగదు, వస్తువులు ఏవీ అడగలేదని కేవలం దాడి చేసి పారిపోయారని చెప్పారు. బాధితుడు కృష్ణారావు మాట్లాడుతూ ... ’బస్టాండ్ నుంచి ఆటో కోసం వచ్చాను. వెనక నుంచి ఇద్దరు వ్యక్తులు వచ్చి నన్ను బాగా కొట్టారు. చంపేయబోయారు. వాళ్లు ఎవరో నాకు తెలీదు. ఎందుకు కొట్టారో కూడా తెలియదు. డబ్బులు ఏమీ అడగలేదు. సైలెంట్‌గా వచ్చి బాగా కొట్టి వెళ్లిపోయారు. వాళ్లు బాగా మత్తులో ఉన్నట్టున్నారు. మొహంపై దెబ్బలు తగిలాయి. గుండెలపై తన్నారు. వారిని నుంచి తప్పించుకుని పారిపోయారు. దాడి జరిగిన సమయంలో అక్కడ ఎవరూ లేరని వివరించారు.

## బహుభార్యత్వం దుర్వినియోగాన్ని సహించం

### ఖురాన్ మేరకు భార్యలను సమానంగా చూసుకోవాలి అలహాబాద్ హైకోర్టు కీలక తీర్పు

అలహాబాద్ హైకోర్టు కీలక తీర్పును వెలువరించింది. ముస్లిం వ్యక్తి ఎంత మందినైనా పెళ్లి చేసుకోవచ్చని,కానీ దానికి సరైన కారణం ఉండాలన్నది. భార్యలందర్నీ ఆ వ్యక్తి సమానంగా చూసుకోవాలని కోర్టు తన తీర్పులో పేర్కొన్నది. భార్యలందర్నీ సమానంగా చూసుకోలేని పక్షంలో ముస్లిం వ్యక్తి మరో వివాహానికి అర్హుడు కాదని కోర్టు చెప్పింది.జస్టిస్ రుణ్ కుమార్ సింగ్ దేశ్‌వాల్ నేతృత్వంలోని సింగిల్ బెంచ్ ఈ తీర్పునిచ్చింది. బహుభార్యత్వాన్ని ఖురాన్ ఆమోదిస్తుందని, కానీ సరైన కారణం ఉండాలని కోర్టు చెప్పింది. ఖురాన్‌లో ఉన్న ఆ వెసలుబాటును స్వార్థ ప్రయోజనాల కోసం మగవాళ్లు వాడుకుంటున్నట్లు కోర్టు పేర్కొన్నది.షరతు ప్రకారం బహుభార్యత్వం ఆమోదంయోగ్యమని కోర్టు తెలిపింది. మొరాబాద్‌కు చెందిన జిల్లా కోర్టు ఓ పిటీషనర్‌కు సమన్లు జారీ చేసిన కేసులో.. అలహాబాద్ హైకోర్టు ఈ కీలక తీర్పును ఇచ్చింది. మొదటి పెళ్లి గురించి దాచి పెట్టాడని, రిలేషన్‌లో ఉన్న సమయంలో తనను లైంగికంగా వేధించాడని రెండో భార్య తన ఫిర్యాదులో పేర్కొన్నది. ముస్లిం చట్టాల ప్రకారం ఇస్లాంలో కొన్ని సందర్భాల్లో ఒకటి కన్నా ఎక్కువ పెండ్లిళ్లు చేసుకునే సౌలభ్యం ఉన్నట్లు హైకోర్టు తెలిపింది. కానీ దీనికి కొన్ని నిబంధనలు ఉంటాయన్నది. అయితే ఖురాన్ కల్పించిన ఆ పరిమితులను ఉల్లంఘిస్తూ దుర్వినియోగం చేస్తున్నట్లు కోర్టు పేర్కొన్నది. బహుభార్యత్వాన్ని ఖురాన్ ఆమోదించడానికి ఓ కారణం ఉందని, పూర్వం ఓ దశలో చాలా మంది మహిళలు వితంతువులు అయ్యేవారని, పిల్లలు అనాథలయ్యేవారని, అరబ్ దేశాల్లో ఇలాంటి సమస్య ఎక్కువగా ఉండేదని, మదీనాలో ముస్లిం వర్గానికి తీవ్ర నష్టం జరిగిందని, ఆ దశలో బహుభార్యత్వాన్ని ఖురాన్ అంగీకరించిందని, అనాథ పిల్లలను.. వారి తల్లులను రక్షించే ఉద్దేశంతో ఆ ప్రతిపాదన జరిగినట్లు- కోర్టు తన తీర్పులో అభిప్రాయపడింది.

# 12.2 తులాల బంగారు ఆభరణాలు, రెండు బైకులు,ఒక ట్రాక్టర్ స్వాధీనం

**- నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య**





**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) మే 15:** ఆర్మూర్ పోలీస్ స్టేషన్ పరిధితో పాటు నిర్మల్, జగిత్యాల జిల్లాలలో చైన్ స్నాచింగ్ కు పాల్పడే మహారాష్ట్ర కు చెందిన దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తెలిపారు. వీరి వద్ద నుంచి 18 లక్షల విలువ గల 12.2 తులాల బంగారం, ఒక ట్రాక్టర్, రెండు మోటార్ సైకిల్ లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని పోలీస్ స్టేషన్ లో గురువారం జిల్లా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మోటార్ సైకిల్ ల వెనకాల కూర్చున్న మహిళలను టార్గెట్ చేసుకొని, ఆటో వెనకాలే వెళ్లి మహిళల మెడలో నుంచి బంగారు గొలుసులను తెంపుకొని పరారయ్యే చైన్ స్నాచింగ్ దొంగల ముఠాను గురువారం 44 వ జాతీయ రహదారిపై పెర్కిట్ వద్ద అరెస్టు చేసినట్లు తెలిపారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా బోకర్ తాలూకా పొంనాల గ్రామానికి చెందిన శ్రీనివాస్ సాహెబ్ రావు పీతేవాడ్, గోరే కేశవ్ సురేష్, పురుబాజీ బాలాజీ ఇర్లేవాడ్, నిర్మల్ జిల్లా తల్వాడ గ్రామానికి చెందిన ఎలిశెట్టి శ్రీనివాస్, మహారాష్ట్రకు చెందిన రాజు అప్పారావు పీటేవాడ్ లను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నట్లు తెలిపారు.
విజయ్, దండేవాడ్ బాబు పరారీలో ఉన్నట్లు వివరించారు. వీరు ఏడుగురు కలిసి నిర్మల్ జిల్లా మంజులాపూర్ గ్రామానికి వలస వచ్చి కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నా రన్నారు. కూలి పని చేయగా వచ్చిన డబ్బులతో కుటుంబ పోషణ సరిపోక జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు చేస్తున్నారన్నారు. దొంగ లించిన హీరో స్పెండర్ బైక్, బుల్లెట్ బైక్ పై తిరుగుతూ ఆటోలో వెనకాల కూర్చున్న మహిళలను టార్గెట్ చేసుకొని వారి మెడలో నుంచి బంగారు గొలుసులను తెంపుకొని పరారయ్యే వారన్నారు. వీరు ఆర్మూర్ ప్రాంతంలో రెండు, ముప్కల్ ఒకటి, సారంగాపూర్ మండలంలో రెండు, బైంసా మండలంలో ఒకటి, జగిత్యాల జిల్లా మెట్ ల్లిలో ఒకటి, జక్రాన్ పల్లి మండలంలో దొంగతనం ప్రయత్నం చేసి ట్రాక్టర్ ను దొంగతనం చేశారన్నారు. వీరు చేసిన వరుస దొంగతనాల వలన పోలీసులు నిఘా పెట్టడంతో మహారాష్ట్రలోని ఉమ్రి గ్రామానికి పారిపోయి సెల్ ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసుకుని అక్కడే ఉన్నారన్నారు. గురువారం రెండు బైకులపై తిరిగి దొంగతనం చేయడానికి ఆర్మూర్ వైపునకు రాగా పెర్కిట్ బైపాస్ దగ్గర వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుకోవడం జరిగిందని, వీరు దొంగతనాలు చేసినట్లు అంగీకరించారన్నారు. వీరి వద్దనుంచి 14 గ్రాముల పుస్తెలతాడు, 10 గ్రాముల బంగారు చైన్, 23 గ్రాముల బంగారు గొలుసు, 10 గ్రాముల గుండ్ల పేరు, ఐదు గ్రాముల పుస్తెలు గుండ్ల పేరు, 60 గ్రాముల మూడు బంగారు గొలుసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి ఒక ట్రాక్టర్ తోపాటు రెండు బైక్ లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.
ఆర్మూర్ పట్టణంలో వరుస చైన్ స్నాచింగ్ చోరీలకు పాల్పడే అంతర్ రాష్ట్ర ముఠాను పట్టుకున్న పోలీస్ అధికారులను సిపి సాయి చైతన్య అభినందించారు.
ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో సీఐ సత్యనారాయణ గౌడ్, రూరల్ సీఐ శ్రీధర్ రెడ్డి, ఎస్సై రజనీకాంత్ దొంగలను పట్టుకోవడానికి కృషి చేశారన్నారు.అదే విధంగా ఆర్మూర్ పోలీస్ స్టేషన్ క్రైమ్ పార్టీ, నిజామాబాద్ సి ఆర్ డి సిబ్బందిని అభినందించి నగదు బహుమతి అందజేస్తామన్నారు. ఈ సమావేశంలో ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, ఆర్మూర్ ఎస్ హెచ్ ఓ సత్యనారాయణ గౌడ్, ఆర్మూర్ రూరల్ సిఐ శ్రీధర్ రెడ్డి,ఎస్సై రజినీకాంత్, ఆర్మూర్ పోలీస్ స్టేషన్ క్రైమ్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

# డ్రంకన్ డ్రైవ్లో పట్టుబడిన ఐదుగురికి జైలు శిక్ష, 27 మందికి జరిమానా



**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) మే 15:** మద్యం తాగి వాహనాలు నడిపినటువంటి 32 మందికి ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ ఆదేశానుసారం ఇన్స్పెక్టర్ పి.ప్రసాద్ తేదీ 15 న కౌన్సిలింగ్ నిర్వహించిన అనంతరం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్ జాన్ ముందర హాజరుపరచగా 27 మందికి రూ 38500/-జరిమానా విధించి, ఐదు గురికి రెండు రోజులు జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ ఏసీపీ తెలిపారు

# అదుపు తప్పిన బైక్ వ్యక్తి మృతి



**ములుగు (మన వెలుగు) మే 15 :** జిల్లాలోని వెంకటాపూర్ మండలంలోని నల్లగుంట గ్రామ మూల మలుపు వద్ద అదుపు తప్పిన బైక్ వ్యక్తి మృతి పసుల. ప్రశాంత్ వయసు (25) జవహర్ నగర్ వాసిగా వెంకటాపూర్ మండల్ పోలీసులు గుర్తించారు

# ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ సమన్వయ సమావేశం

**- పకడ్బందీ ఏర్పాట్లు**
**- అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్**





**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) మే 15 :** 2024-25 విద్య సంవత్సరం ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం తన చాంబర్లో సంబంధిత వివిధ శాఖల అధికారులతో ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఇంటర్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లను ఇంటర్ విద్య అధికారి రవికుమార్ తో అదనపు కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ, మే నెల 22వ తేదీ నుండి 27వ తేదీ వరకు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రతి రోజు ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు, రెండవ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం రెండున్నర గంటల నుండి సాయంత్రం ఐదున్నర గంటల వరకు జరుగుతాయని తెలిపారు. ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు మొత్తం18,837 మంది విద్యార్థులు హాజరు కానుండగా, 36 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు. పరీక్షలను సాఫీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులకు పరీక్షల సమయాలకు అనుగుణంగా ఆర్టీసీ బస్ రవాణా సదుపాయం కల్పించాలని ఆర్టీసీ అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. పరీక్షలు జరిగే సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని ట్రాన్స్ కో అధికారికి సూచించారు. నిర్ణీత సమయానికి సకాలంలో ప్రశ్నపత్రాలు పరీక్ష కేంద్రాలకు చేరే విధంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు శాఖ కు సూచించారు. పరీక్షలు ప్రారంభం అయ్యే సమయానికి ముందే విద్యార్థులు తమకు కేటాయినుంచిన పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ తెలియజేశారు. పరీక్షలు పూర్తైన తర్వాత జవాబు పాత్రల బండల్లను పోస్టల్ శాఖ వారు తమ ఆధీనంలో కి తీసుకుని ఎలాంటి లోటుపాట్లను తావులేకుండా నిర్ణీత ప్రాంతాలకు జాగ్రత్తగా చేర్చాలని పోస్టల్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షలు సజావుగా కొనసాగేలా అందరు సమన్వయంతో పని చేయాలని అధికారులకు సూచించారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్ లను మూసి వేయించాలని, 144 సెక్షన్ అమలు చేయాలని, తగిన సంఖ్యలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి పరీక్షా కేంద్రంలోనూ తప్పనిసరిగా తాగునీటి వసతి, మూత్రశాలలు, మరుగుదొడ్లు అందుబాటులో ఉంచాలని, పరిశుభ్రమైన వాతావరణం నెలకొనెలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలను ఎగ్జామ్ సెంటర్లలో నియమిస్తూ, ఫస్ట్ ఎయిడ్ కిట్ అందుబాటులో ఉంచాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.ఇంటర్ విద్య అధికారి రవికుమార్ మాట్లాడుతూ కాపీయింగ్ కు ఆస్కారం లేకుండా ఆరుగురు సిట్టింగ్ స్క్వాడ్, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమిస్తున్నమని అన్నారు.
మొత్తం 36 పరీక్ష కేంద్రాల్లో సీ. సీ. కెమెరాల పర్యవేక్షణ ఉంటుందని అన్నారు.
వేసవి దృశ్య విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా మంచినీటి వసతి తో పాటు ఏర్పాటు చేయడం జరుగుతుందని అలాగే వైద్యశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రథమ చికిత్స నిర్వహణ కోసం ఏర్పాట్లు, కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేస్తామన్నారు. ప్రశాంత వాతావరణంలో సజావుగా పరీక్షలు జరిగేలా ఆయా శాఖల అధికారులు అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని అన్నారు. సమీక్షా సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి, ట్రాన్స్ కో, పోస్టల్, రెవెన్యూ వివిధ శాఖల అధికారులు, అడిషనల్ పోలీసు కమిషనర్ బస్వారెడ్డి, ఇంటర్ పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు చిన్నయ్య, కనక మహాలక్ష్మి పాల్గొన్నారు.

# మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో ఒకరికి ఒక రోజు జైలు శిక్ష

**జగిత్యాల (మన వెలుగు) మే 15 :** వివరాల్లోకి వెళ్తే రాయికల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉప్పమడుగు కి చెందిన అల్లేపు వెంకట నర్సయ్య (49) అనే వ్యక్తి అతిగా మద్యం సేవించి వాహనం నడుపుతుం డగా ఎస్ఐ సుధీర్ రావు సంబంధిత వ్యక్తి పై కేసు నమోదుచేసి కోర్టు లో హాజరుపరచగా న్యాయమూర్తి శ్రీ కరుణాకర్ స్పెషల్ జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ సెకండ్ క్లాస్ వెంకట నర్సయ్య కు ఒక రోజు జైలు శిక్ష విధించడం జరిగింది.

# పదోన్నతి శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్పీ

**జగిత్యాల ప్రతినిధి (మన వెలుగు) మే 15 :** జిల్లా ఆర్మ్ రిజర్వ్ విభాగం లో హెడ్ కానిస్టేబుల్స్ గా విధులు నిర్వహించి అసిస్టెంట్ రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్ (ఏఆర్ ఎస్ఐ గా పదోన్నతి పొందిన జాదవ్ గోకుల్ జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ ఏఎస్ఐ



పదోన్నతి స్టార్ చిహ్నాన్ని అలంకరించి పదోన్నతి శుభాకాంక్షలు తెలియజేశారు. పెరిగిన బాధ్యతను క్రమశిక్షణాయుతంగా నిర్వహిస్తూ ప్రజలలో పోలీస్ శాఖ పట్ల నమ్మకాన్ని, గౌరవాన్ని పెంచే విధంగా విధులు నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి భీమ్ రావు , రిజర్వు సబ్ ఇన్స్పెక్టర్ రమేష్ పాల్గొన్నారు.

# గాండ్ల పట్టణ సంఘం భవనాన్ని ప్రారంభించిన అర్బన్ ఎమ్మెల్యే






**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) మే 15 :** నిజామాబాద్ నగర సిర్నాపల్లి గడి గాండ్ల పట్టణ సంఘం రెండొవ అంతస్థు భవనాన్ని అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ ప్రారంభించడం జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ మాట్లాడుతు నిజామాబాద్ పట్టణ గాండ్ల సంఘం రాష్ట్రంలో ఆదర్శంగా నిలిచే విదంగా ఐక్యమత్యంతో అంచలంచలుగా ఎదగడం అభినందనీయం అన్నారు.గాండ్ల పట్టణ సంఘం రెండవ అంతస్తుకు ఎస్ డి ఎఫ్ నిధుల కింద 5 లక్షలు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. రాబోయే రోజుల్లో కూడా సంఘం అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు.
తాను ఎమ్మెల్యేగా గెలిచి దాదాపు రెండు ఏండ్లు కావొస్తున్న రాష్ట్ర ప్రభుత్వం కనీసం ఎమ్మెల్యే నిధులు కూడా మంజూరు చేయలేదని అన్నారు.నియోజకవర్గం అభివృద్ధికి పార్టీలకు అతీతంగా కలిసి రావడానికి సిద్ధంగా ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం వివక్ష చూపుతుందని అన్నారు.
టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ అర్బన్ నియోజకవర్గంపై ప్రత్యేక చొరవ తీసుకొని స్పెషల్ ఫండ్ మంజురు చేయాలనీ విజ్ఞప్తి చేసారు.ఈ కార్యక్రమంలో గాండ్ల పట్టణ సంఘం అధ్యక్షులు అశోక్, నాగరాజు, నూడా చైర్మన్ కేశవేణు, నరాల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల శిక్షణ తరగతులను సందర్శించిన కలెక్టర్

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) మే 15 :** రాష్ట్ర విద్యా శాఖ ఆదేశాల మేరకు ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం సందర్శించారు. జిల్లా కేంద్రంలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ లో సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో కరిక్యులర్ అండ్ థెరపిక్ స్ట్రాటజీస్ ఫర్ సీడబ్ల్యూఎస్ఎన్ (చైల్డ్ విత్ స్పెషల్ నీడ్) అంశంపై ఐదు రోజుల శిక్షణ తరగతులు కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా శిక్షణ తరగతులను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి, బోధనా సామర్థ్యాలను మెరుగుపర్చే దిశగా ఉపాధ్యాయులకు తర్ఫీదు ఇస్తున్న తీరును పరిశీలించారు. ప్రత్యేకించి గణితం, ఆంగ్లం బోధించే ఉపాధ్యాయులకు శిక్షణ అందిస్తున్న అంశాల గురించి స్టేట్ రిసోర్స్ పర్సన్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు సులభంగా అర్ధమయ్యే రీతిలో, ఆకట్టుకునే విధంగా పాఠాలను ఎలా బోధించాలి, అభ్యాసన సామర్థ్యాలను ఎలా పెంపొందించాలి అనే దానిపై అందిస్తున్న శిక్షణను కలెక్టర్ ఆయా తరగతి గదులను సందర్శించి నిశితంగా పరిశీలన జరిపారు. వెనుకబడిన విద్యార్థుల పట్ల తీసుకోవాల్సిన ప్రత్యేక జాగ్రత్తల గురించి స్టేట్ రిసోర్స్ పర్సన్లు అవగాహన కల్పించారు. శిక్షణ తరగతులను చక్కగా ఆకళింపు చేసుకుని, నేర్చుకున్న అంశాలను తరగతి గదులలో పాటిస్తూ విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్యను బోధించాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఉపాధ్యాయులకు హితవు పలికారు. విద్యార్థులను తమ సొంత బిడ్డలుగా భావిస్తూ, వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులకు కల్పించిన సదుపాయాలను పరిశీలించారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, ఇతర అధికారులు ఉన్నారు.





# నగరంలో 58 కోట్ల 43 లక్షల విలువ గల అభివృద్ధి పనులు పూర్తి చేశాం..... రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి మరియు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

- నగరంలో డార్క్ స్పాట్ లేకుండా 352 నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు
- కార్పోరేషన్ పరిధిలో 45 కోట్లతో నూతన సిసి రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం
- పారిశుధ్య నిర్వహణ మెరుగుపరిచేలా నూతన వాహనాలు పరికరాల కొనుగోలు
- రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేషన్ అభివృద్ధి పనుల పై పత్రికా ప్రకటన విడుదల చేసిన రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి మరియు జిల్లా కలెక్టర్



గత సంవత్సర కాలం రామగుండం నగరంలో 58 కోట్ల 43 లక్షల విలువగల అభివృద్ధి పనులను పూర్తి చేయడం జరిగిందని రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి మరియు లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

15వ ఆర్థిక సంఘం ద్వారా 9 కోట్ల 64 లక్షల రూపాయలు, ఎల్.ఆర్.ఎస్ ఇంట్రెస్ట్ ఫండ్స్ క్రింద 84 లక్షల రూపాయలు, 14వ ఆర్థిక సంఘం క్రింద 50 లక్షల రూపాయలు, టి.యు.ఎఫ్.ఐ.డి.సి క్రింద 45 కోట్ల రూపాయలు, ప్రత్యేక అభివృద్ధి కింద కోటి 84 లక్షల రూపాయలు, వరద సహాయ నిధుల కింద 65 లక్షల రూపాయల తో వివిధ అభివృద్ధి పనులు పూర్తి చేసామని అన్నారు.

నగరంలో డార్క్ స్పాట్ లేకుండా విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు ప్రాధాన్యత కల్పించామని అన్నారు. త్రాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, చాలా రోజులుగా పెండింగ్ లో ఉన్న సిసి రోడ్లు నూతన డ్రైయిన్ నిర్మాణ పనులు పూర్తి చేశామని , మెరుగ్గా పారిశుధ్య నిర్వహణ చేసేందుకు పకడ్బందీ చర్యలు తీసుకున్నామని అన్నారు.

15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగించి 80 లక్షల రూపాయలతో 8 ట్రాక్టర్లు, 65 లక్షల 50 వేల రూపాయలతో 8 ట్రాలీలు, 47 లక్షల రూపాయలతో 5 ట్రాక్టర్ విత్ ట్రాలీలను, 76 లక్షల రూపాయలతో 2 జేసిబీ లను మెరుగ్గా పారిశుధ్యం నిర్వహించేందుకు కొనుగోలు చేశామని తెలిపారు.

పారిశుధ్య సిబ్బందికి అవసరమైన భద్రత సామాగ్రి కోసం 4 లక్షల 50 వేలు ఖర్చు చేశామని అన్నారు.

83 లక్షల రూపాయలతో డ్రై రిసోర్స్ కేంద్రం, 5 ఇంక్లైన్ కాలనీ వద్ద కోటి 43 లక్షల రూపాయలతో అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులు పూర్తి చేశామని కలెక్టర్ తెలిపారు.

4 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ రామగుండం నగరంలో నీటి సరఫరా కనెక్షన్స్ అవసరమైన డిస్ట్రిబ్యూషన్ పైప్ లైన్ వేయడం వంటి పనులు పూర్తి చేశామని అన్నారు.

రామగుండం నగరంలో డార్క్ స్పాట్ ఉండకుండా ఎల్ఆర్ఎస్ వడ్డీ సొమ్మును వినియోగించి 20 లక్షల రూపాయలతో స్ట్రీట్ లైట్స్, 25 లక్షల రూపాయలతో 400 ఎల్ఈడి లైట్స్, 36 లక్షల రూపాయలతో విద్యుత్ స్తంభాల తరలింపు పనులు చేపట్టి పూర్తి చేశామని అన్నారు. నగరంలో 352 నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి డార్క్ స్పాట్ లేకుండా చేశామని అన్నారు.

తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (టి.యూ.ఎఫ్..డి.సి) ద్వారా 45 కోట్ల రూపాయలు ఖర్చు చేసి నగరంలోని వివిధ డివిజన్ లలో అవసరమైన చోట సీసీ రోడ్డు మురికి కాల్వ నిర్మాణ పనులు పూర్తి చేశామని అన్నారు.

ప్రత్యేక అభివృద్ధి నిధుల ద్వారా కోటి 80 లక్షల రూపాయలతో సిసి రోడ్డు అండ్ గ్రౌండ్ డ్రైనేజ్, ఓపెన్ డ్రైయిన్ నిర్మాణ పనులు పూర్తి చేసామని అన్నారు.

వరద సహాయక నిధుల నుంచి 65 లక్షల రూపాయలు ఖర్చు చేసి మ్యాన్ హోల్స్ ను మరమ్మతు పనులు పూర్తి చేశామని అన్నారు. గత సంవత్సర కాలంలో ప్రభుత్వం ఈ 58 కోట్ల 43 లక్షలు ఖర్చుచేసి అభివృద్ధి పనులు పూర్తి చేశామని, రాబోయే రోజులలో కూడా రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కు మరిన్ని ఖర్చు చేసి, ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి మరియు కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# సింగరేణి నుండి 5 లక్షల టన్నుల బొగ్గు సరఫరాకు ఎన్ఎస్పిసిఎల్ ఒప్పందం



సింగరేణి సంస్థ నుండి ఈ ఆర్థిక సంవత్సరంలో ఐదు లక్షల టన్నుల బొగ్గు సరఫరాకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దుర్గాపూర్ లో ఉన్న ఎన్ఎస్పిసిఎల్ గురువారం ఒప్పందం కుదుర్చుకుంది.

సింగరేణి ఛైర్మన్ మరియు ఎండీ ఎన్.బలరామ్ ఆదేశాల మేరకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ శ్రీ ఎస్డీఎం సుభాని సమక్షంలో సింగరేణి జనరల్ మేనేజర్ మార్కెటింగ్ ఎన్ వి. రాజశేఖర్ రావు, ఎన్ఎస్పిసిఎల్ సీఈవో దివాకర్ కౌశల్, జనరల్ మేనేజర్లు నీల్ కమల్, పలాష్ లు అగ్రిమెంట్ పై సంతకాలు చేసారు.

ప్రముఖ జాతీయ బొగ్గు ఉత్పత్తి సంస్థ ఆయన ఎన్టీపీసీ, మరియు స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా వారు సంయుక్తంగా ఏర్పాటు చేసుకున్న జాయింట్ వెంచర్ కంపెనీ ఎన్ఎస్పిసిఎల్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో దుర్గాపూర్ వద్ద ఏర్పాటు చేసిన థర్మల్ విద్యుత్ కేంద్రానికి ఈ బొగ్గును సరఫరా చేయనున్నారు. సింగరేణి సంస్థ నాణ్యత గల బొగ్గును తగిన పరిమాణంలో సకాలంలో అందజేస్తుందని, కనుక తాము ఈ కంపెనీ నుండి బొగ్గు కొనడానికి ముందుకు వచ్చామని ఎన్ఎస్పిసిఎల్ అధికారులు తెలియజేశారు . ఇంకా ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ డిప్యూటీ జనరల్ మేనేజర్లు శ్రీనివాసరాజు, సురేందర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి...జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

## పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి తనిఖీ పరిశీలించిన జిల్లా కలెక్టర్



ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.

గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని డయాగ్నస్టిక్ హబ్, ఆయుర్వేద హొమియో సెంటర్, ఆయుష్మాన్ భారత్ వెల్ నెస్ సెంటర్, మాతా శిశు ఆసుపత్రిలో ఉన్న డెంటల్ సెంటర్, కంటి విభాగం, గర్భిణీ మహిళల వార్డు, ల్యాబ్, ఆరోగ్య మహిళా కౌంటర్ ల, 2డి ఎకో రూం, వివిధ ఓపి రూమ్ లను క్షుణ్ణంగా పరిశీలించారు.


ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, డయాగ్నొస్టిక్ హబ్ వద్ద అన్ని రకాల వైద్య పరీక్షలు తప్పనిసరిగా జరగాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఔట్ పేషెంట్ సంఖ్య పెరగాలని, దీనికి జిల్లా యంత్రాంగం నుంచి పూర్తి స్థాయిలో సహకారం అందిస్తామని అన్నారు.

మెడికల్ రీయింబర్స్ మెంట్ బిల్లులు ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని అన్నారు. ఆసుపత్రిలో రోగులు, వారి సహాయకులు కూర్చునే విధంగా అధికంగా కుర్చీలు వేయాలని, ఓపి రూమ్ వద్ద సీటింగ్ అరేంజ్మెంట్స్ పెంచాలని కలెక్టర్ సూచించారు. ఆసుపత్రిలో రోగులు వీక్షించేందుకు వీలుగా 2,3 ప్రదేశాలలో టీవీలు ఏర్పాటు చేయాలని తెలిపారు

నూతనంగా ఆసుపత్రికి వచ్చిన ఆర్.ఎం.ఓ డాక్టర్ విజయ్ జిల్లా కలెక్టర్ ను మర్యాద పూర్వకంగా కలిశారు.

ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్,ఆర్.ఎం.ఓ డాక్టర్ విజయ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రహమత్ నగర్ డివిజన్ లో వివిధ అభివృద్ధి పనులు



జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహమత్ నగర్ డివిజన్ లో గురువారం రోజున వివిధ అభివృద్ధి పనులు గురించి డీసీ జకీయ సుల్తానా గారితో సమావేశం అయినా రహమత్ నగర్ కార్పొరేటర్ CN రెడ్డి ఈ యొక్క సమావేశం లో ఈ EE రాజకుమార్, DPO వెంకట్ కిషన్,AMC బాలరాజ్, శానటైజర్ విభాగం విజయ్ కుమార్, GHMC సిబ్బంది మరియు డివిజన్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు..

# జీ. మధుసూదన్ రెడ్డి... దేవరకద్ర ఎమ్మెల్యే

తెలంగాణలో రికార్డు స్థాయిలో ఈ సారి ధాన్యం దిగుబడి వచ్చిందనీ

ఎప్పుడూ లేని విధంగా 8724 ధాన్యం కొనుగోలు కేంద్రాలు చేశాం... 70 శాతం ధాన్యం కొనుగోలు చేశాంఅని పేర్కొన్నారు

43 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 6720 కోట్ల రూపాయలను రైతులను చెల్లించాం.. 760 కోట్ల బోనస్ ఇవ్వబోతున్నాం అని తెలిపారు

రేవంత్ రెడ్డి పాలన చూసి బీఆర్ఎస్ నాయకులంతా అసహనంలో ఉన్నారు..

సీఎం రేవంత్ రెడ్డిని ఆడిపోసుకోవడమే బీఆర్ఎస్ నేతల పనిగా మారింది..

అడ్డగోలు సంపాదనతో ఫామ్ హౌస్ , గెస్ట్ హౌస్ ల్లో ఉండి ప్రభుత్వంపైన అక్కసు వెళ్లగక్కుతున్నారు..

కేసీఆర్ ను కేటీఆర్ తప్ప ఎవరూ పొగడటం లేదనీ అన్నారు

కేసీఆర్ రావాలని ఎవరు అడిగారు.. ? తెలంగాణ కు మీ అవసరం లేదు.. భవిష్యత్తు కూడా లేదనీ

మళ్లీ బీఆర్ఎస్ గెలవడం పగటి కల.. మరోసారి గెలిచేది కాంగ్రెస్ పార్టీనే.. 100 సీట్లు రావడం ఖాయం

%ఘూూ% ఆఫీసర్ వెంకట్ రామ్ రెడ్డి కేసీఆర్ కాళ్లు కడిగినప్పుడు ఏమైంది..?

కవిత కాళ్ళ దగ్గర కలెక్టర్ కూర్చున్నప్పుడు ఏమైంది మీ పరువు..?

అధికారాన్ని అడ్డం పెట్టుకొని %ఘూూ% ఆపీసర్లతో కాళు ళ మొక్కించుకున్న నీచ చరిత్ర మీది..

పార్టీ పదవుల కోసం కేటీఆర్,హరీష్ రావు,కవితలు కొట్టుకుంటున్నారు..

నాయకత్వం కోసం డబ్బులిచ్చి మీడియాలో ప్రచారం చేసుకుంటున్నారు..

బీఆర్ఎస్ లో ఉద్యమ కారులు ఎంతో మంది ఉన్నారు..?

కేసీఆర్ నాయకత్వం తెలంగాణ ప్రజలకు అవసరం లేదనీ మళ్ళీ ఇంకో సారి కూడా తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందనీ తెలిపారు

కాళేశ్వరం విషయంలో హరీష్ రావు చిలుక పలుకులు పలుకుతుండు

హరీష్ రావు,కేసీఆర్ కాళేశ్వరం లో కోట్లు దోచుకున్నారన్నారు



వాళ్లకు సహకరించిన అధికారులు కూడా ఇప్పుడు బలి అవుతున్నారు..

కాళేశ్వరంలో చేసిన దోపిడీ విషయంలో కేసీఆర్ ,హరీష్ రావు లను వదిలి పెట్టొదని సీఎం రేవంత్ రెడ్డి ని కోరుతున్నాం..

18 నెలల్లో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు ను పూర్తి చేస్తాం అన్న సీఎం రేవంత్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు..

అధ్యక్ష పదవి కోసం బీజేపీ నేతలు ఈటెల రాజేందర్, బండి సంజయ్ లు కూడా సీఎం రేవంత్ రెడ్డిని విమర్శిస్తున్నారు

బీఆర్ఎస్ హయాంలో లక్ష కోట్ల అవినీతి జరిగితే కేంద్ర దర్యాప్తు సంస్థలు ఎందుకు విచారణ చేయడం లేదో బీజేపీ నేతలు చెప్పాలనీ తెలిపారు

మిస్ వరల్డ్ వల్ల తెలంగాణ ఖ్యాతి ప్రపంచంలో విరజిల్లుతోంది.

తెలంగాణ సాంప్రదాయాలను ప్రపంచానికి తెలియజేస్తున్నాం.అని అన్నారు

109 దేశాలకు చెందిన సుందరీమణులు తెలంగాణలో ప్రముఖ ప్రాంతాలను సందర్శిస్తున్నారనీ

మిస్ వరల్డ్ విషయంలో కేటీఆర్, హరీష్ రావు కుళ్లు కుంటున్నారు.. అక్కసు వెల్లగక్కుతున్నాడనీ

తెలంగాణ మహిళలను అవమానించేలా కేటీఆర్ మాట్లాడుతున్నాడనీ పేర్కొన్నారు

రామప్ప దేవాలయంలో మిస్ వరల్డ్ కంటెం టెస్టులు వాళ్ల కాళ్లు వాళ్లు కడుక్కొని వెళ్లినా కేటీఆర్ తప్పుడు ప్రచారం చేయిస్తున్నాడనీ

గతంలో ఐఏఎస్ అధికారులతో కేసీఆర్, కవిత కాళ్లు మొక్కించుకున్నాడు.. కేటీఆర్ కు అప్పుడు కనిపించలేదా..?

సీఎం రేవంత్ రెడ్డి పేరు చెపితే బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు హడలిపోతున్నారనీ తెలిపారు

# గోదావరిఖనిలో సింగరేణి ఆధ్వర్యం లో మెగా జాబ్ మేళా

**100 కంపెనీలు ... 3 వేల ఉద్యోగ అవకాశాలు**

**నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి**

**సీఎండీ ఎన్. బలరామ్**



సింగరేణి ప్రాంత నిరుద్యోగ యువతకు వివిధ ప్రైవేట్ కంపెనీలలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం రామగుండం 1 ఏరియా గోదావరిఖని లో వచ్చే ఆదివారం (మే 18) న సింగరేణి ఆధ్వర్యంలో మెగా ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు సింగరేణి ఛైర్మన్ మరియు ఎండీ ఎన్. బలరామ్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

ఈ మెగా జాబ్ మేళాలో హైదరాబాద్ ప్రాంతానికి చెందిన సుమారు 100 ప్రైవేటు సంస్థల లో వివిధ విభాగాల్లో 3 వేల ఖాళీలు భర్తీ కోసం ఎంపిక జరుగుతుందన్నారు . నిరుద్యోగ యువత హైదరాబాద్ లాంటి నగరాలకు వెళ్లి ఉద్యోగాల కోసం ప్రయత్నాలు చేయడం వ్యయ ప్రయాసలతో కూడుకుని ఉంటోందని, ఈ నేపథ్యంలో పలు కంపెనీల ప్రతినిధులతో మాట్లాడి స్థానికంగా ఉద్యోగ మేళాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. దీనిని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

ఇటువంటి జాబ్ మేళాలు ఇకపై ఇతర ఏరియాలలో కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు. సింగరేణి సంస్థ లో ఉద్యోగ నియామకాలతో పాటు, నిరుద్యోగ యువత అందరికీ ఏదో ఒక ఉపాధి లేదా ఉద్యోగం కల్పించడం కోసం ఈ తరహా కార్యక్రమాలను సింగరేణి సంస్థ స్వచ్ఛందంగా చేపడుతుందని , ఈ అవకాశాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సింగరేణి సంస్థ సింగరేణి ప్రాంత నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లను ఇప్పటికే మందమర్రి, రామగుండం-1, భూపాలపల్లి ఏరియాలలో ప్రారంభించామని ఇతర ఏరియాలలో కూడా త్వరలో ప్రారంభిస్తున్నామన్నారు. యువతలో నైపుణ్యాలు పెంచడమే కాకుండా వారికి ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు వీలుగా జాబ్ మేళాలను కూడా ఏర్పాటు చేయిస్తున్నట్లు వివరించారు.

# మే 18 న మెగా జాబ్ మేళా"

రామగుండం శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ గురువారం రోజు ఒక పత్రిక ప్రకటన ద్వారా తెలియజేసిన ప్రకారం, మే 18, 2025 తేదీన గోదావరిఖనిలోని జనహారపరల్ స్టేడియంలో ఘనంగా నిర్వహించనున్న "మెగా జాబ్ మేళా"కి సంబంధించిన వివరాలు అధికారికంగా విడుదల చేశారు.



ఈ కార్యక్రమం నోబెల్ ఎడ్యుకేషనల్ ఎంప్లాయ్మెంట్ అసోసియేషన్ మరియు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించబడుతోంది. ఈ మేళాలో 100కి పైగా ప్రఖ్యాత సంస్థలు పాల్గొంటుండగా, సుమారు 3000కి పైగా ఖాళీ ఉద్యోగాల భర్తీకి అవకాశాలు కల్పించబడుతున్నాయని ఎమ్మెల్యే గారు పేర్కొన్నారు.

10వ తరగతి నుంచి డిగ్రీ, ఇంజినీరింగ్, డిప్లొమా, ఐటీఐ తదితర అర్హతలు కలిగిన నిరుద్యోగ యువత ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. నిరుద్యోగ సమస్యతో బాధపడుతున్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, తమ భవిష్యత్తు బలోపేతానికి ఈ జాబ్ మేళా వేదిక కావాలని ఎమ్మెల్యే గారు ఆకాంక్షించారు.

అంతేగాక, జిల్లా, మండల స్థాయిల నుండి వేలాది మంది యువత పాల్గొననున్న ఈ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, అన్ని వర్గాల నిరుద్యోగులు తమ బయో డేటా, అర్హత సర్టిఫికెట్లు మరియు ఆధార్ కార్డు వంటి అవసరమైన పత్రాలతో తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.


మరింత సమాచారం కోసం హెల్ప్ లైన్ నంబర్లు 9491144252, 9948377353 ను సంప్రదించాలని సూచించారు...

# ఈనెల 20 న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిడిఎస్ యు పూర్తి మద్దతు

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) మే 15 :** ఈనెల 20న జరగబోయే కార్మికుల సార్వత్రిక సమ్మెకు ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పిడిఎస్ యు నిజామాబాద్ జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని ఈ సందర్భంగా పిడిఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్నటువంటి కార్మిక వ్యతిరేక విధానాలపై నాలుగు లేబర్ కోడ్ లు రద్దుచేసి 44 చట్టాలుగా యాదవిధిగా




కొనసాగించాలని, సమాన పనికి సమాన వేతనం కల్పించాలని, కార్మికులకు పని దినంగా 8 గంటలు కొనసాగించాలని, ప్రభుత్వ పరిశ్రమల అమ్మకాన్ని వెనక్కి తీసుకోవాలని ఈ డిమాండ్లతో ఈనెల 20న సార్వత్రిక సమ్మె నిర్వహించడం జరుగుతుంది. ఈ సమ్మెకు కార్మికులు కర్షకులు విద్యార్థులు యువకులు మేధావులు ప్రజాసామిక వాదులు సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని పిడిఎస్ యు నిజామాబాద్ జిల్లా కమిటీగా పిలుపునిస్తామన్నారు



# మ్యాన్ ఆఫ్ ద మ్యాన్షన్ హౌజ్

నందమూరి బాలకృష్ణ ఓ పాపులర్ సంస్థకు బ్రాండ్ అంబాసిడర్‌గా చేస్తున్నారు. అది కూడా ఆయనకు నచ్చిన బ్రాండ్ కావడం విశేషం. ఇంతకు ముందు ఆయన కొన్ని యాడ్స్ చేసినా... ఇది మాత్రం సమ్‌థింగ్ స్పెషల్ అని చెప్పాలి. బాలయ్య చేసిన కొత్త యాడ్ తాజాగా విడుదల చేశారు. బాలయ్య కు ఇష్టమైన డ్రింకింగ్ బ్రాండ్ ఏది? అనేది ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అమెరికా వెళ్లినా సరే తన వెంట మ్యాన్షన్ హౌస్ తీసుకుని వెళతారని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆయన చిన్న అల్లుడు చెప్పిన విషయం తెలిసిందే. కానీ ఎప్పుడూ దాని గురించి బాలయ్య తన నోటి వెంట చెప్పింది లేదు. కానీ ఈసారి ఏకంగా ఈ బ్రాండ్ పై యాడ్ చేసి షాక్ ఇచ్చాడు. ఈ యాడ్‌లో బాలయ్య లుక్ అదిరిపోయింది. అయితే ఆహా తెలుగు ఓటీటీలో ఆయన హోస్ట్ గా చేసిన 'అన్‌స్టాపబుల్' టాక్ షోకి మ్యాన్షన్ హౌస్ అడ్వర్టయిజింగ్ స్పార్టర్ అయింది. అప్పుడు మొదటిసారి బాలయ్య నోటి వెంట మ్యాన్షన్ హౌస్ అని వచ్చింది. ఇప్పుడు డైరెక్ట్ గా ఆ సంస్థకు ఆయన ప్రచారం చేస్తూ ఒక వాణిజ్య ప్రకటన చేయడం విశేశం ప్రజంట్ ఈ యాడ్ వైరల్ అవుతుంది.



# సరిగమకు ది ప్యారడైజ్ ఆడియో హక్కులు

హిట్ 3తో సూపర్ హిట్ అందుకున్న నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం ది ప్యారడైజ్. దసరా సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న శ్రీకాంత్ ఓదెల ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ ఈ సినిమాకు సంగీతం అందిస్తుండటంతో పాటలు కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా ఆడియో హక్కులు భారీ ధరకు అమ్ముడుపోయినట్లు తెలుస్తుంది. ప్రముఖ మ్యూజిక్ కంపెనీ సరిగమ మ్యూజిక్ రూ. 18 కోట్లకు 'ది ప్యారడైజ్' ఆడియో రైట్స్‌ని దక్కించుకున్నట్లు సమాచారం. నాని కెరీర్‌లో ఒక సినిమా ఆడియో హక్కులకు ఇంత పెద్ద మొత్తం రావడం ఇదే మొదటిసారని సినీ వర్గాలు చెబుతున్నాయి. సినిమా విడుదల కాకముందే ఆడియో హక్కులు ఇంత పెద్ద మొత్తానికి అమ్ముడుపోవడం చిత్ర యూనిట్‌కు ఉత్సాహాన్ని ఇచ్చింది. ఇటీవల విడుదలైన టీజర్‌కు మంచి స్పందన లభించింది. ఈ చిత్రం తెలుగుతో పాటు- హిందీ, తమిళ, కన్నడ, మలయాళం, బెంగాలీ, ఇంగ్లీష్ మరియు స్పానిష్ భాషల్లో వచ్చే ఏడాది (2026) మార్చి 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ చిత్రం 1980ల కాలంలో హైదరాబాద్‌లో జరిగిన కొన్ని నిజమైన సంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్నట్లు- సమాచారం. ఇది ఒక యాక్షన్ థ్రిల్లర్ కథాంశంతో రూపొందుతోంది.




# జోష్ మీదున్న 'థగ్ లైఫ్' టీమ్.. వివరాలు వెల్లడి

కమల్‌హాసన్ హీరోగా మణిరత్నం దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'థగ్ లైఫ్' భారీ తారాగణంతో పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా సిద్ధమవుతోంది. దేశ సరిహద్దుల్లో ఏర్పడిన పరిస్థితుల దృష్ట్యా ఇటీవల జరగాల్సిన దీని ఆడియో విడుదల కార్యక్రమాన్ని వాయిదా వేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ ఆడియో లాంచ్ వివరాలను టీమ్ వెల్లడించింది.మే 17న దీని ట్రైలర్ రానున్నట్లు చిత్రబృందం తెలిపింది. మే 24న ఆడియో విడుదల కార్యక్రమం భారీ స్థాయిలో జరగనున్నట్లు వెల్లడించింది. ఆ ఈవెంట్‌లో ఏఆర్ రెహమాన్ ప్రత్యేక ప్రదర్శన ఇవ్వనున్నట్లు తెలిపింది. "ఇటీవల దేశం కోసం మేం మా వేడుకలను నిలిపివేశాం. ఈ విషయంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులు ఎంతో మద్దతు ఇచ్చినందుకు కృతజ్ఞతలు. ఇప్పుడు థగ్ లైఫ్ ప్రయాణాన్ని తిరిగి ప్రారంభిస్తున్నాం" అని నోట్ విడుదల చేసింది. 'నాయకన్' (1987) లాంటి హిట్ తర్వాత కమల్ - మణిరత్నం కాంబినేషన్‌లో వస్తోన్న చిత్రమిది. గ్యాంగ్‌స్టర్, యాక్షన్ డ్రామా ఫిల్మ్‌గా ఇది సిద్ధమవుతోంది. త్రిష, శింబు కీలకపాత్రల్లో కనిపించనున్నారు. కమల్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. జూన్ 5న ఈ సినిమా విడుదల కానుంది.



# నా కథ సినిమాగా వస్తూ చూడాలని ఉంది: భజ్జీ

భారత క్రికెట్ చరిత్రలో అత్యంత గొప్ప బౌలర్లలో హర్భజన్ సింగ్ ఒకరు. తన స్పిన్ బౌలింగ్‌తో పాటు-, కీలక సమయాల్లో బ్యాటింగ్‌తోనూ ఎన్నో చిరస్మరణీయ విజయాలను అందించాడు. 'టర్బనేటర్'గా పిలువబడే హర్భజన్ క్రికెట్ కెరియర్ సినిమాటిక్ గా ఉంటుందని దాన్ని వెండితెరపై చూపిస్తే వర్కవుట్ అవుతుందని కొందరి ఒపీనియన్. రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో భజ్జీ తన జీవిత కథ సినిమాగా వస్తే చూడాలని ఉందన్నాడు. అంతేకాకుండా తన రోల్ కు పాత్రకు న్యాయం చేయాలని భావిస్తున్న ఇద్దరు హీరోల పేర్లను వెల్లడించాడు.అందుల్లో ఒకరు విక్కీ కౌశల్ మరొకరు రణవీర్ సింగ్. తన పాత్రకు వీరైతేనే బాగుంటుందని చెబుతున్నాడు. ఇప్పటికే కపిల్ బయోపిక్ 83లో రణ్ వీర్ సింగ్ కపిల్ దేవ్ గా కనిపించాడు. బహుశా ఇదే రన్వీర్ తన పాత్ర కూడా చేస్తే బాగుంటుందని భజ్జీ భావిస్తున్నాడేమో. గతంలో రణవీర్ సింగ్ '83' చిత్రంలో కపిల్ దేవ్ పాత్రలో ఒదిగిపోయి, ఆ పాత్రను ఎంత అద్భుతంగా పోషించగలడో నిరూపించుకున్నాడు. ఆ చిత్రం బాక్సాఫీస్ వద్ద పెద్దగా విజయం సాధించకపోయినా, రణవీర్ నటనకు మాత్రం ప్రశంసలు దక్కాయి. మరోవైపు, విక్కీ కౌశల్ 'ఛావా' చిత్రంలో తన పాత్రలో సీరియస్ నెస్ ను చూపించాడు.బాక్సాఫీస్ వద్ద రూ. 600 కోట్లకు పైగా వసూలు చేసాడు. హర్భజన్ సింగ్ బయోపిక్‌లో తన పాత్రను ఎవరు పోషిస్తారో, ఆ చిత్రం ఎలా రూపుదిద్దుకుంటు-ందో చూడాలి. విక్కీ కౌశల్ తన ఇంటెన్సిటీతో కాని రణవీర్ సింగ్ తన ఎనర్జీతో భజ్జీ పాత్రలో మెప్పిస్తారో లేరో చూడాలి.



# దాదాసాహెబ్ ఫాల్కే బయోపిక్‌లో ఎన్టీఆర్?



తాజా సమాచారం ప్రకారం సినీ పితామహుడిగా పరిశ్రమ కొనియాడే దాదాసాహెబ్ ఫాల్కే బయోపిక్ లో నటించేందుకు తారక్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు ప్రచారం నడుస్తుంది. ఈ ప్రాజెక్టు వెనుక రాజమౌళి, కార్తికేయ, వరుణ్ గుప్తా ప్రమేయం కూడా ఉందని టాక్. అంతే కాదు.. ఇప్పటికే స్క్రిప్ట్ కూడా సిద్ధం కాగా, అది విన్న జూనియర్ ఎన్టీఆర్ చాలా ఎగ్జైట్ అయి ఓకే చేశారట. అయితే భారతీయ చలన చిత్ర పరిశ్రమ ప్రస్థానాన్ని ఆవిష్కరిస్తూ రెండేళ్ల కిందటనే 'మేడ్ ఇన్ ఇండియా' అనే సినిమా అనౌన్స్ చేయగా, దర్శక ధీరుడు ఎస్ఎస్ రాజమౌళి సమర్పణలో నితిన్ కక్కర్ మూవీని తెరకెక్కించబోతున్నట్టు తెలిపారు. దీనికి సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు, త్వరలో వెల్లడిస్తామని అప్పుడు చెప్పగా, ఆ తర్వాత దాని నోరు విప్పింది లేదు. కాని ఇప్పుడు ఉన్నట్టుండి ఇందులో ఎన్టీఆర్ నటిస్తారని వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. దాదాసాహెబ్ ఫాల్కే జీవితం చాలా పెద్దది. అలాంటి కథలను కచ్చితంగా ఇప్పటి తరానికి పరిచయం చేయాల్సిన అవసరం ఎంతైన ఉంది. అందుకే జూనియర్ ఎన్టీఆర్ లాంటి నటు-డు అయితేనే ఈ ప్రాజెక్ట్ భాగా చేయగలరు. మరి ఇండియన్ సినిమా పుట్టుక, పెరుగుదలను తెలియజేస్తూ.. సినిమాలకి బీజం ఎక్కడ పడింది, ఎదిగే క్రమంలో ఎలాంటి ఒడిదుడుకులు ఎదుర్కోవలసి వచ్చింది అనేది చిత్రంలో చూపించనున్నారట.



# రాజ్‌తో సమంత.. సతీమణి శ్యామాలి పోస్ట్ వైరల్

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత వ్యాక్తిగత జీవితం గురించి రోజుకో వార్త వైరల్ అవుతూనే ఉంటోంది. ఎంతో ప్రేమించిన అక్కినేని నాగచైతన్యతో విడాకుల తర్వాత సింగిల్‌గా ఉంటుంది సమంత. నాగచైతన్య రెండో పెళ్లి చేసుకోని హ్యాపి లైఫ్ లీడ్ చేస్తున్నప్పటికి సమంత కూడా రెండో పెళ్లి చేసుకుంటే బాగుంటుందని అభిమానులు, సినీ ప్రియులు కోరుకుంటు-న్నారు. అయితే కొద్ది రోజులుగా దర్శకుడు రాజ్ నిడిమోదుతో తరచు కనిపిస్తోంది సామ్.. ఎక్కడికి వెళ్లిన సమంత పక్కన రాజ్ ఉంటున్నాడు. దీంతో ఆమె వైవాహిక జీవితం పై నెట్టింట రూమర్స్ గట్టిగానే ప్రచారం అవుతున్నాయి. అయితే రాజ్ నిడిమోరుకు ఇప్పటికే పెళ్లి అయ్యింది. ఇలాంటి టైం లో తాజాగా సమంత తన ఇన్‌స్టాలో ఓ పోస్ట్ షేర్ చేసింది. ఇందులో రాజ్‌పై సమంత వాలినట్టుగా కనిపిస్తుంది. దీంతో ఈ వార్తలు మరింత పుంజుకున్నాయి. వారి బాండింగ్ రోజు రోజుకి బలపడుతుందిగా అని కొందరు కామెంట్ చేస్తున్నారు. ఈ ఫోటో సోషల్ మీడియాలో బాగా వైరల్ అయింది. అయితే తాజాగా రాజ్ సతీమణి శ్యామాలి తాజాగా ఎక్స్ వేదికగా ఒక సందేశాత్మక పోస్ట్ పెట్టింది.. 'నా గురించి ఆలోచించి, విని, మాట్లాడేవారితోపాటు నన్ను కలిసి, నాతో మాట్లాడి నా గురించి రాసే వారందరికి ప్రేమ, ఆశీస్సులు పంపుతున్నా' అనే పోస్ట్ ను ఆమె షేర్ చేశారు. ప్రస్తుతం ఇది నెట్టింట వైరల్ గా మారింది. కొంతకాలంగా ఎలాంటి పోస్ట్ షేర్ చేయని ఆమె ఉన్నట్టుండి ఇలాంటి సందేశం ఎందుకు షేర్ చేశారా? అని, ఆమె కచ్చితంగా సమంతని ఉద్దేశించే మాట్లాడుతూంది అని కామొంట్ లు విపడుతున్నాయి.

# తమిళనాట పెద్ద హిట్ కొట్టిన టూరిస్ట్ ఫ్యామిలీ



ఈ మధ్య తమిళంలో పెద్ద సినిమాలకంటే చిన్న సినిమాలే తమ హావా చూపిస్తున్నాయి. ఈ ఏడాదిలో వచ్చిన లబ్బర్ పందు, మెయ్యాళగన్, కుడుంబస్తాన్, డ్రాగన్ చిత్రాలు సూపర్ హిట్‌లు అందుకున్నాయి. అయితే ఇదే కోవలో చిన్న సినిమాగా వచ్చి సూపర్ హిట్‌గా నిలిచింది టూరిస్ట్ ఫ్యామిలీ. తమిళ నటులు శశికుమార్, సిమ్రాన్ ప్రధాన పాత్రల్లో నటించగా.. యోగి బాబు, మిథున్ జై శంకర్, కమలేష్ జెగన్, ఎం.ఎస్. భాస్కర్, రమేష్ తిలక్, భగవతి పెరుమాళ్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటించారు. అభిషన్ జీవింత్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం మే 1న ప్రేక్షకుల ముందుకు వచ్చి సూపర్ హిట్‌ను అందుకుంది. ముఖ్యంగా ఈ సినిమా చూసిన ప్రేక్షకులు చాలా బాగుందని ప్రశంసిస్తున్నారు. తలైవర్ రజనీకాంత్‌తో పాటు- నటు-డు శివకార్తికేయన్ కూడా ఈ సినిమా చూసి చిత్రబృందంని ప్రత్యేకంగా పిలిపించుకుని అభినందించారు. ఇదిలావుంటే ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతుంది. కేవలం రూ.5 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా రూ.55 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. మరోవైపు తక్కువ బడ్జెట్‌తో రూపొందినప్పటికీ, 2025లో అత్యధిక వసూళ్లు సాధించిన తమిళ చిత్రాలలో ఇది ఒకటిగా నిలిచింది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. శ్రీలంకలో నెలకొన్న ఆర్థిక సంక్షోభం కారణంగా ఒక తమిళ కుటు-ంబం తమ స్వస్థలాన్ని విడిచిపెట్టి భారతదేశానికి శరణార్థులు(స॥÷బిషగ॥)గా వస్తారు. అనంతరం వారు చెన్నైలో కొత్త జీవితాన్ని ప్రారంభించడానికి ప్రయత్నిస్తారు. కానీ వాళ్లు ఎవరు అనేది చెప్పకుండా దాచిపెట్టాల్సి వస్తుంది. అలా దాచిపెడుతూ ఉండగా అనుకోకుండా రామేశ్వరం దగ్గర ఒక బాంబ్ బ్లాస్ట్ సంఘటన జరుగుతుంది. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేయడం మొదలుపెడతారు. అయితే ఈ కేసుకి వీరికి సంబంధమేంటి.. శ్రీలంక నుంచి వచ్చిన ఈ ఫ్యామిలీకి ఎదురైన సమస్యలేమిటి అనేది ఈ సినిమా కథ.



# జులైలో తెరపైకి కింగ్డమ్

ఈ నెల 30న విడుదల కావాల్సిన విజయ్ దేవరకొండ  పాన్ ఇండియా చిత్రం 'కింగ్డమ్' వాయిదా పడింది. దీన్ని జులై 4న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు తెలియజేస్తూ చిత్ర బృందం బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. "ఈ సినిమాని తొలుత అనుకున్న తేదీకే తీసుకురావాలని ఎంతో ప్రయత్నించాం. కానీ, ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా దీన్ని వాయిదా వేస్తున్నాం. ఇలాంటి సమయంలో ప్రచారాలు, వేడుకలు నిర్వహించడం సరికాదనిపించింది. అందుకే దీన్ని మేము జులై 4న విడుదల చేయాలని నిర్ణయించుకున్నాం" అని ఆ ప్రకటనలో పేర్కొంది . గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ముస్తాబైన ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్‌ను సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించారు. ఇందులో విజయ్ సరసన భాగ్యశ్రీ బోర్సే  కథానాయికగా నటించింది. అనిరుధ్ సంగీత దర్శకుడిగా వ్యవహరించారు.